క్లుప్తంగా

శాకంబరీ ఉత్సవాలు



నర్సంపేట : పట్టణంలోని సర్వాపురం శ్రీ సంతోషిమాత ఆలయంలో మంగళవారం దుర్గాదేవి శాకంబరీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవీ ఉపాసకుడు గట్టు నారాయణచార్యులు, ప్రధాన అర్చకుడు పూజలు నిర్వహించారు. వికాస తరంగిణి బాధ్యులు ప్రవచనం వినిపించారు. దుర్గాదేవి చరిత్ర, అవతారాలు 18 అధ్యాయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షుడు కృష్ణారావు, కార్యదర్శి రంగనాథస్వామి, కోశాధికారి రేణుక, ప్రతినిధులు కోట శ్రీనివాస్, పెద్ది సాంబశివుడు, కోట కల్పన, సంధ్య, అన్నపూర్ణ, హైమ, ఇమ్మడి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌నకు మాజీ ఎమ్మెల్యే హాజరు



వర్ధన్నపేట : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఘట్కేసర్‌లోని ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన వర్క్‌షాప్‌నకు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులకు వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు.

హెల్త్ కిట్స్ పంపిణీ



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం ప్రాంతంలో మున్సిపల్ సిబ్బందికి వర్షాకాలం నేపథ్యంలో కార్పొరేటర్ మనీషా శివశంకర్ మంగళవారం హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా కిట్లు అందించినట్లు తెలిపారు. కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



దుగ్గొండి : మండలంలోని గుడ్డెలుగులపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు ఆయా పార్టీలకు రాజీనామా చేసి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో పలువురు చేరుతున్నారని చెప్పారు. పార్టీలో ప్రతిఒక్కరికీ సముచిత ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చుక్క రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, కోశాధికారి జంగిలి రవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగిలి రమేశ్, నాయకులు ఏడ్డె బాబురావు, పేరం రాజు, వేల్పుల అశోక్, నాగరాజు, సిద్దు, రాజిరెడ్డి రాజేందర్, సంజీవ పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ



నర్సంపేట : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో మంగళవారం నిర్వహించిన 'కామిక్ రైటింగ్' పోటీలో చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న చిలపాక ద్రాక్షాయని ప్రతిభ చాటి ద్వితీయ బహుమతి సాధించింది. 'విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు'పై నిర్వహించిన పోటీలో గైడ్ టీచర్‌గా ఉపాధ్యాయుడు గజవెల్లి సుందర్ వ్యవహరించారు. విద్యాశాఖ జిల్లా సెక్టోరల్ అధికారి సుజన్‌తేజ, హెచ్ఎంలు రామకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు చేతుల మీదుగా ద్రాక్షాయని బహుమతి, ప్రశంస పత్రం అందుకుంది. విద్యార్థినిని, గైడ్ టీచర్‌ను, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను హెచ్ఎం జయ, ఉపాధ్యాయులు అభినందించారు.

బియ్యం అందజేత

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన మిట్టగడపుల నర్సయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్ 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత నర్సయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సారూ.. కరెంట్ ఇవ్వండి..

విద్యుత్ సౌకర్యం కోసం రెండేళ్లుగా ఎదురు చూపులు

- డీడీలు తీసిన 290 మంది రైతులు
- ఆర్ఓఎఫ్ఆర్ భూములకు విద్యుత్ అందించాలని వేడుకోలు



ఈ ఫొటోలోని మహిళపేరు భూక్య లక్ష్మి. మండలంలోని గోవిందాపూర్ శివారు ఎర్రచెరువు తండాకు చెందిన లక్ష్మి కుటుంబం సాగు చేసుకుంటున్న మూడు ఎకరాల పోడు భూమికి ప్రభుత్వం అటవీ హక్కు పత్రాన్ని అందించింది. దీంతో బోరు వేయించుకున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను సంప్రదించగా అంచనావేసి టీఎస్ ఎన్పీడీసీఎల్ సంస్థకు రూ.3,80,080 డీడీ తీయాలని తెలిపారు. దీంతో ఏడాది క్రితం డీడీ తీసి విద్యుత్ శాఖ అధికారులకు అప్పగించారు. కానీ, అటవీ శాఖ అధికారుల అనుమతి లేదంటూ విద్యుత్ అధికారులు గిరిజన రైతులను ఇక్కట్లకు గురి చేస్తున్నారు.

నల్లబెల్లి: మూడు దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్న గిరిజన రైతులకు ప్రభుత్వం అటవీ హక్కు పత్రాలను అందించింది. ఈ భూముల్లో పంటలు సాగు చేసుకునేందుకు బోర్లు వేయించుకుని విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజన రైతులు అధికారులు, ప్రజా ప్రతినిధులను పలుమార్లు వేడుకున్నా అటవీ హక్కు చట్టాలను సాకుగా చూపిస్తూ దాటవేస్తున్నారని వాపోతున్నారు. అర్హులైన గిరిజన రైతులకు విద్యుత్ సౌకర్యాం కల్పించాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని అర్హులైన గిరిజనులకు ప్రభుత్వం అటవీ హక్కు పత్రాలను అందించింది. మూడు దశాబ్దాలకు పైగా పోడు భూముల్లో పంటలు సాగు చేస్తున్న ఖానాపురం మండలంలోని 2,641 మంది రైతులు, నల్లబెల్లి మండలంలో 1830 మంది, నర్సంపేట మండలంలో 320, నెక్కొండ మండలంలో 413 మంది గిరిజన రైతులకు ప్రభుత్వం హక్కు పత్రాలను అందించారు. పంటల సాగు నీటి అవసరాల కోసం రైతులు సొంత ఖర్చులతో బోర్లు వేయించుకున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ నల్లబెల్లి, ఖానాపురం, నర్సంపేట మండలాల్లో 290 మంది గిరిజన రైతులు దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత బోర్లకు విద్యుత్ సరఫరా చేయడానికి స్తంభాలు, తీగలు, నియంత్రికలు అవసరమయ్యే మేరకు అందుకు కావాల్సిన వ్యయం విద్యుత్ అధికారుల సూచనల మేరకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. అందుకు సంబంధించిన పత్రాలను అధికారులకు అందించారు. కానీ ఏడాదిగా అధికారులు నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహిస్తూ పట్టించుకోవడంలేదు. అటవీ శాఖ అనుమతులు రాగానే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



డీడీలు చూపిస్తున్న గిరిజన పోడు రైతులు

సమన్వయ లోపం..

విద్యుత్, అటవీ శాఖ అధికారుల సమన్వయ లోపం ఆర్ఓఎఫ్ఆర్ రైతులకు శాపంగా మారింది. ఇప్పటి వరకు రైతుల పంట చేలలో బోరుబావులు ఏర్పాటు చేసుకున్నారు. తమ సమీప రైతుల బావులకు విద్యుత్ సరఫరా ఉంది. కానీ, నల్లబెల్లి, ఖానాపురం మండలాల్లో 290 మంది రైతులు బోర్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావునిస్తుంది. ఇప్పటికైనా విద్యుత్, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ గిరిజన రైతులకు విద్యుత్ సరఫరా జరిగేలా జిల్లా ఉన్నతాధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను వినియోగించుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి

నెక్కొండ : పేదలు అనారోగ్య పరిస్థితుల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటే సీఎంఆర్ఎఫ్‌ను వినియోగించుకోవాలని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం తాజాగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, కోశాధికారి సుబ్బారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణలను సన్మానించారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు, జిల్లా నాయకుడు హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : చెక్కులు పంపిణీ చేస్తున్న హరీశ్‌రెడ్డి

లింగాపురంలో..

నర్సంపేట : మండలంలోని లింగాపురంకు చెందిన రాజ్‌బోయిన రాజ్‌కుమార్, తౌర్రి అనిల్, జూలూరి వీరసోమయ్యలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ తప్పెట రమేశ్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేయిస్తున్నట్లు, సంక్షేమ పథకాలు అమలు చేయిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా సీత్లా భవాని పండుగ



నల్లబెల్లి : మండలంలోని అర్వయ్యపల్లిలో గిరిజనులు మంగళవారం సీత్లా భవాని పండుగ ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు నిండి పంటలు బాగా పండాలని, పశువులు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ గ్రామ శివారులోని గువ్వలబోడు వద్ద మేరమ్మ, తోళ్లా, మాత్రాల్, కెంకాళి, హింగ్లా, ద్వాళంగార్, సీత్లా భవానీలకు పూజారి జాటోత్ పడిధితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. పాయసం, పచ్చజొన్నతో చేసిన గుగ్గిళ్లను నైవేద్యంగా సమర్పించారు. లుంకిడియా విగ్రహం వద్ద పశువులను దాటించారు. మాజీ జెడ్పీటీసీ బానోత్ హరినాథ్ సింగ్ వసంత, మాజీ సర్పంచ్ మమత మురళీనాయక్ దంపతులు పులియగోర్‌లను ఎత్తుకొని పూజా కార్యక్రమాల వద్దకు డప్పు వాయిద్యాలు, ఆటపాటలతో తరలివెళ్లారు.

మహిళలు, బాలికల రక్షణకు కృషి

- సఖి సెంటర్ కేస్ వర్కర్ స్వప్న

నల్లబెల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాల ద్వారా మహిళల, బాలికల రక్షణకు కృషి చేస్తున్నాయని సఖి సెంటర్ కేస్ వర్కర్ స్వప్న తెలిపారు. మండలంలోని శనిగరం, రాంపూర్ గ్రామాల్లో సఖి సెంటర్ సేవలు, రక్షణ చట్టాలపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడారు. సఖి కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు పోలీస్, న్యాయ, వైద్య సాయాలతోపాటు ఉచితంగా వసతి లభిస్తుందని చెప్పారు. సఖి కేంద్రం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు డయల్ 100, 181 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందాలని సూచించారు. అనంతరం సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమెన్ హబ్ జెండర్ స్పెషలిస్ట్ హర్షిత, సీసీ పద్మ, వీఓఏలు ఉమ, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్వప్న

ఎంఈఓ తనిఖీ



ఖానాపురం : మండలంలోని నాజీతండ, బుధరావుపేట స్కూళ్లను ఎంఈఓ శ్రీదేవి మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాలను పెంచేలా బోధనలో మెళకువలు పాటించాలని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఆరిఫ్, భద్రు, సీఆర్పీ భాస్కర్, ఉపాధ్యాయులు వీరన్న, సూరయ్య, రామయ్య, పవన్, రవీంద్రచారి, సంపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సెలూన్‌లో చోరీ.. నిందితుల గుర్తింపు..?

ఖానాపురం : మండల కేంద్రంలోని బాలాజీ సెలూన్‌లో చోరీ జరిగిందని, నిందితులను గుర్తించారని సమాచారం. వివరాలిలా.. సెలూన్ నిర్వాహకుడైన రాగంపేటకు చెందిన బాలరాజు ఈనెల 13న ఊరికి వెళ్తూ షాప్‌నుఅతడి కుమారుడు రాహుల్‌కు అప్పగించాడు. కాగా రాహుల్ ఆ రోజు రాత్రి 8 గంటలకు షాప్ మూసి ఇంటికి వెళ్లాడు. ఈనెల 14న షాపు తెరవగా గల్లా పెట్టెలో ఉండాల్సిన రూ.10 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిందితుల గుర్తింపు...?

చోరీకి పాల్పడిన నిందితులను గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. షాపు నిర్వాహకుడు రాహుల్ స్నేహితులైన రాగంపేటకు చెందిన ముగ్గురు యువకులు చోరీకి పాల్పడినట్లు సమాచారం. ఈనెల 13న షాపు దిశగా రాత్రి 10 గంటల సమయంలో సదరు యువకులు షాపు దిశగా వచ్చినట్లు, అనంతరం సమీపంలోని మద్యం షాపులో మద్యం సేవించినట్లు సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా నిర్ధారణ అయినట్లు తెలిసింది. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా గ్రామస్తులు సదరు యువకులను నిలదీయగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు సమాచారం. వివరాలు నిర్ధారణ కావాల్సి ఉంది.

మోడల్ స్కూల్‌లో 'ప్రారంభ్'

సంగెం : మండలంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం ప్రారంభ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. నూతన విద్యాసంవత్సరంలో చేరిన విద్యార్థులకు చిరుకానుకలు అందించి స్వాగతం పలికారు. అనంతరం మిస్టర్, మిస్ గవిచర్ల పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కమిటీ ఎన్నిక

నర్సంపేట : బీఆర్ఎస్ చెన్నారావుపేట మండల కమిటీని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా బాల్నె వెంకన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా అనుముల కుమారస్వామి, ప్రదీప్‌కుమార్, రాజేశ్, అధికార ప్రతినిధిగా కృష్ణచైతన్యరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా భూక్య రవీందర్‌నాయక్, మాదారపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కుసుమ నరేందర్, చెరుకుపల్లి విజేందర్‌రెడ్డి, భానోతు గణేశ్, నమిండ్ల సురేశ్, కార్యదర్శిగా నర్సింగరావు, ప్రచార కార్యదర్శిగా కిషన్, సహాయ కార్యదర్శిగా బానాపురం రాజు ఎన్నికయ్యారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



గీసుకొండ : ధర్మారంలో గోదాసి చిన్న మిత్ర మండలి ఆధ్వర్యంలో హనుమకొండకు చెందిన చెందిన గణేశ ఐ కేర్ ఆస్పత్రి, ఎస్ఆర్ఐ ఇండో అమెరికన్ సంస్థ సహకారంతో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 35 మందికి శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించారు. హైదరాబాద్‌లోని ఎస్ఆర్ఐ ఇండో అమెరికన్ సంస్థ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేయించడంతోపాటు మందులు ఇప్పిస్తామని డాక్టర్ గుండేటి గణేశ్ తెలిపారు. డాక్టర్ భారతి మాట్లాడుతూ ఆస్పత్రి ఆధ్వర్యంలో రూ.40 వేల విలువైన కంటి శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో సహాయక సిబ్బంది పూజ, స్వప్న, చిన్న మిత్రమండలి సభ్యులు గోదాసి వీరేశం, బైకని శివ పవన్, పోలెబోయిన భరత్, శ్రీధర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం

నర్సంపేట/ఖానాపురం/పర్వతగిరి : నర్సంపేట, ఖానాపురం, పర్వతగిరి మండలాల్లో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. నర్సంపేటలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ స్కూల్, అక్షర ద స్కూల్‌లో విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కోశాధికారి వనజ విద్యార్థులతో మొక్కలు నాటించి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఖానాపురం మండలంలోని రాగంపేటలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఏఓ బోగ శ్రీనివాస్ ప్రజలకు మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. పర్వతగిరిలో స్పెషల్ ఆఫీసర్ శేషు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. పూలు, పండ్లు, ఆయుర్వేద మొక్కలు నాటాలని సూచించారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన గిద్దె రాజు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు మంగళవారం రూ.12 వేల సాయం అందజేశారు. తొలుత రాజు చిత్రపటానికి నివాళులర్పించారు.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు చిలుక యాకూబ్ (70) సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. యాకూబ్ అంత్యక్రియల కోసం మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగ్గళ్లపాటి లక్ష్మీనారాయణ మంగళవారం రూ.5 వేల సాయం అందజేశారు. స్థానిక సోషల్ సర్వీస్ టీమ్ సభ్యుడు, టీచర్ రామ్మూర్తి, ఉద్యమకారులు శ్రీనివాస్, మేకల కుమారస్వామి, సత్యనారాయణ, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, తదితరులు నివాళులర్పించారు.

నైపుణ్యంతోనే ఉత్తమ ఫలితాలు

- సీఐ రఘుపతిరెడ్డి

నర్సంపేట : నైపుణ్యం పెంచుకుంటేనే ఉత్తమ ఫలితాలు సాధించగలరని స్థానిక సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని యువ పరివర్తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి సీఐ హాజరై మాట్లాడారు. అన్ని అంశాల్లోనూ నైపుణ్యం ఉంటేనే రాణించగలరని చెప్పారు. యువత ఉన్నత స్థాయికి ఎదిగే దిశగా నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. యువ పరివర్తన బ్రాంచ్ మేనేజర్ రొట్టె సురేశ్ మాట్లాడుతూ చదువు మధ్యలో ఆపేసిన యువతకు జీవితంలో యువ పరివర్తన మరో అవకాశమని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీఆర్డీ జిల్లా అధ్యక్షులు అడ్డ రాజు, చింత కుమారస్వామి, దుగ్గొండి మండల అధ్యక్షుడు సిద్ధ కుమారస్వామి, ట్రైనర్లు దివ్య, స్పందన, గౌరై ప్రియాంక, రెహనా, శివరామన్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : మాట్లాడుతున్న సీఐ రఘుపతిరెడ్డి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో సోషల్ సర్వీస్ అండ్ కమ్యూనికేషన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్లకార్డులను ప్రదర్శించగా ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్, ఉపాధ్యాయులు భవానీ చంద్, రమేశ్, నర్సింహారెడ్డి, కృష్ణవేణి, అనిత, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఉన్నతిలో తల్లిదండ్రులు కీలకం

- సీఐ రాజగోపాల్

పర్వతగిరి : పిల్లలు ఉత్తమ పౌరులుగా ఉన్నత స్థాయికి చేరుకోవడంలో తల్లిదండ్రులు కీలకమని సీఐ రాజగోపాల్ తెలిపారు. 'మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నిర్మూలన'పై స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎల్లలకు బాల్యం నుంచే క్రమశిక్షణ అలవర్చాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని చెప్పారు. డ్రగ్స్ వంటి వాటికి, అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.



మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

డ్రగ్స్‌కు బానిసలుగా ఎవరైనా మారితే పోలీసులకు సమాచారం అందించి సహాయ సహకారాలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఎస్సై ప్రవీణ్ మాట్లాడారు. ప్రజలకు పోలీసులు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటారని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

అవగాహనతోనే టీబీ నిర్మూలన



కరపత్రాలను ప్రదర్శిస్తున్న వైద్యుడు, సిబ్బంది

- తిమ్మంపేట సబ్‌సెంటర్ వైద్యాధికారి పృథ్వీ

దుగ్గొండి : టీబీ నిర్మూలనలో అవగాహన కీలకమని తిమ్మంపేట సబ్‌సెంటర్ వైద్యాధికారి పృథ్వీ తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సబ్‌సెంటర్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం సందర్భంగా పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ పృథ్వీ మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ టీబీ వ్యాధి, నివారణపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. టీబీ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే కరపత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సలోమీ, హెల్త్ అసిస్టెంట్ చాణక్య, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎం బుజ్జమ్మ, ఆశ వర్కర్లు రమ, శారద, విజయ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

- జీఎంపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లయ్య

నర్సంపేట : గొల్ల కురుమలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య విమర్శించారు. పట్టణంలోని గెస్ట్‌హౌస్‌లో మంగళవారం నిర్వహించిన సంఘం ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గొల్ల కురుమలకు రూ.2 లక్షలతో గొర్రెల కొనుగోలుకు బదులు నగదు బదిలీ చేస్తామని, సహకార సంఘాల సభ్యులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.6 లక్షల పరిహారం ఇస్తామని, తదితర అనేక హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక విస్మరించిందని తెలిపారు. సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ కావటి విజయ్, జిల్లా కార్యదర్శి పరికి మధూకర్ మాట్లాడుతూ గొల్ల కురుమలు ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లయ్య, జిల్లా కార్యదర్శి మధూకర్, జిల్లా సహాయ కార్యదర్శి కుండె లింగస్వామి ఆధ్వర్యంలో సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బాషబోయిన శ్రీను, బోళ్ల రాజ్‌కుమార్, సలహాదార్లుగా గాదం సమ్మయ్య, నానబోయిన కొమురయ్య, అధ్యక్షుడిగా రాజులపాటి సూరయ్య, ప్రధాన కార్యదర్శిగా దండి రాజు, ఉపాధ్యక్షులుగా రాజయ్య, కొమురయ్య, జక్కుల మల్లేశ్, మధూకర్, సహాయ కార్యదర్శులుగా బూస రాజు, నానబోయిన సుమన్, ఐలయ్య, కుమారి, నిమ్మల శ్రీనివాస్, సభ్యులుగా కుమార్, రాజన్న, తదితరులు ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

'రైతు భరోసా'పై చర్చకు సిద్ధం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

నల్లబెల్లి : రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ముందుంటోందని తెలిపారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నాటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎంత మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించారో ప్రకటించాలన్నారు. పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఓర్వలేక విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మాలోత్ రమేశ్, నాయకులు చార్ల శివారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారు శేఖర్, ప్రధాన కార్యదర్శి మాలోత్ మోహన్, ఉపాధ్యాయులు పెంతల కొమురారెడ్డి ఆంగోత్ పూల్ సింగ్, కార్యదర్శులు జిల్లా మునేందర్, జెట్టి రామ్మూర్తి, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దురి తిరుపతిరావు, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు బేతి భరత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

పరామర్శ

ఖానాపురం : మండలంలోని దబ్బీర్‌పేటలో మల్లయ్య, చిలుకమ్మనగర్‌లో చంద్రకళ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ మంగళవారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో నాయకులు ఉపేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సుధాకర్, సంపత్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నారంలో..

పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కుసుమ ఏకాంబ్రం తల్లి రాధమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్ మంగళవారం పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఈరగాని సాంబయ్య, తాటికొండ యాకన్న, గుండా సాయిలు, గొడుగు నీకేశ్, ముంజంపెల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.